# మరచిపోలేని.... నా బాల్యం !

1950-60

అమ్మ చనిపోయినపుడు చెల్లికి నాలుగు నెలలూ - నాకు నాల్గున్నరేళ్లు! అంత పసిగుడ్డుని ఎలా పెంచాలో తెలీక కళవళ పడిపోయారు నాన్న !

సరిగ్గా అప్పుడే - తన కొడుకు పోయాడని - వాడి స్థానంలో చెల్లికి పాలిచ్చి పెంచుతానని ముందుకొచ్చింది... మా పాలేరు భార్య పోశాని !

నాన్న ఎంతో సంతోషించారు! ఆరు నెలల తర్వాత పాపని తనకి అప్పగించాలన్న షరతుతో చెల్లినిచ్చేశారు ఆమెకి !

కానీ... నాకే... మనసు పొరలో - ఏదో భయం ! బాధా - దిగులూ !

కారణం... అంతకు కొన్ని నెలల క్రితం ఓరోజు పక్కింట్లోంచి చిన్న పిల్లాడి ఏడ్పు విన్పించింది ! అరగంట గడిచింది ! అప్పటికీ వాడి ఏడ్పు ఆగలేదు! ఏమైందా అని వాళ్లింటికి వెళ్లాను.

ఆశ్చర్యం ! ఇంట్లో ఎవరూ లేరు ! అంతా పొలం పనులకి వెళ్ళినట్టున్నారు! ఉయ్యాల్లో బాబు గుక్కపట్టి ఏడుస్తున్నాడు. దగ్గరికి వెళ్ళి చూసి - షాక్ తిన్నాను! ఆ పిల్లోడి మెడ - ఉయ్యాల్లోని నులక తాడులో ఇరుక్కొని - తల కిందికి వేళ్లాడ్తోంది! గబుక్కున వెళ్లి - అతికష్టమ్మీద ఉయ్యాల్లోంచి తీసి - వాణ్ణి మా ఇంటికి తీసుకొచ్చి - ఆ తర్వాత సాయంత్రం వాళ్ళ అమ్మకి అప్పగించాను!

చెల్లి



శ్రీమతి యన్. విజయ

పోశాని కూడా పొలం పనులకి వెళ్లేది కాబట్టి - ఆమె బయటికి వెళ్ళినపుడు... చెల్లికేమౌతుందో అన్న భయంతో ప్రతి గంట గంటకీ వాళ్ళింటికి వెళ్ళి - చెల్లిని చూసి వస్తూ వుండేదాన్ని ! దాని తలకి రెండు వేపులా దిళ్ళు పెట్టి వచ్చేదాన్ని!

చెల్లీ - నేనూ ఇద్దరం తల్లి ప్రేమ ఎలా వుంటుందో తెలీకుండా పెరిగాం ! కనీసం అమ్మ ఎలా వుండేదో కూడా తెలీదు మాకు ! ఆ రోజుల్లో అమ్మ ఫోటో ఎవరూ ఎందుకు తీయలేదా అని ఇప్పటికీ బాధపడ్తూ వుంటాం !

కానీ అమ్మలోటు తెలీనీకుండా పెంచింది పెద్దక్కయ్య! రాత్రిపూట పెద్దక్కయ్య మీదే చేతులూ - కాళ్ళేసి నిద్రపోయేదాన్ని ! తను అత్తారింటికి వెళ్ళిపోతే - బెంగ పెట్టుకునేదాన్ని ! మళ్ళీ తను ఎప్పుడొస్తుందా అని ఎదురుచూస్తూ వుండేదాన్ని ! రాగానే గట్టిగా పట్టేసుకుని మళ్ళీ వెళ్లొద్దని ఏడ్చేసేదాన్ని !

పెద్దక్కయ్య



కీ॥శే॥ శ్రీమతి పి. పద్మ

అప్పటికింకా పెద్దక్కయ్యకి పిల్లలు పుట్టలేదు కాబట్టి... చెల్లెలే తనకో చంటి పిల్లై - దాన్నీ తనతో పాటే అత్తారింటికి తీసుకెళ్ళేది ! అటు అక్కయ్యా - ఇటు చెల్లీ - ఇద్దరూ లేక.... పుట్టెడు దిగులేసేది నాకు !

పెద్దక్కయ్య వస్తే... ఇంటికి వెలుగు వచ్చినట్టుగా ఫీలయ్యేదాన్ని ! తన లాలన అలాంటిది.... అమ్మలేని లోటు తెలిసేది కాదు !

చిన్నప్పుడు మేం గడిలో (కోటలాంటి పెద్దింట్లో) వుండేవాళ్ళం! ఆ ఇంట్లో- అదే ఆవరణలో కమ్మరివాళ్ళూ - కుమ్మరి వాళ్ళూ - కుర్మవాళ్ళూ, కంసాలీ వాళ్ళూ- కంచరి వాళ్ళూ - వండ్రంగి వాళ్ళూ... అలా ఎన్నో చేతి వృత్తుల వాళ్లుండే వాళ్లు!

వాళ్ళతో సహజీవనమేమో - కుండల్నీ, గొంగడినీ, బంగారు గాజుల్నీ, ఇత్తడి బిందెల్నీ, కుర్చీలనూ ఎంతో ఆసక్తిగా చూస్తూ వుండేదాన్ని ! వాళ్ళు తమ వృత్తుల్లో చూపే నైపుణ్యం, కళ నాకు ఆశ్చర్యం కలిగించేది ! ఏ పని ఎలా చేస్తున్నారో దగ్గరుండి తెలుసుకునేదాన్ని ! అవకాశం దొరికితే - వాళ్ళని బతిమాలి, బామాలి- వాళ్ళ పనిముట్ల సాయంతో - ఆయా వస్తువులు తయారు చేయడానికి ప్రయత్నించేదాన్ని! అలా ఎప్పుడూ నా ధ్యాసంతా ఏదో ఒక వస్తువు తయారీ మీదే ఉండేది గానీ - ఉత్తినే కూర్చునేదాన్ని కాదు !

నాన్న



కీ॥శే॥ జి. హన్మంత్ రెడ్డి
(జక్రాన్‌పల్లి)

' ఆడ పిల్లవు ! నీకెందుకమ్మా ఇవి !' అనేవాళ్ళు... వాళ్ళు!

" నేర్చుకోనీ ! తప్పేముందీ ! ఇవి ఆడ పిల్లల పనులూ - మగ పిల్లల పనులూ అని అనుకోకూడదు ! అందరూ అన్ని రకాల పనులూ నేర్చుకోవాలి !" అనేవారు నాన్న. ఆ రోజుల్లోనే - ఆ పల్లెటూళ్లో - అందరూ వింతగా చూస్తూంటే సైకిల్ తొక్కడం నేర్పించారు నాన్న. అదీ ఆడ పిల్లల్ని ఆయన ప్రోత్సహించే తీరు !

ఒక రోజు అక్కయ్యలిద్దరూ అత్తారింటికి వెళ్ళారు ! నాకూ చెల్లికీ జడలు వేయడానికి ఇంట్లో ఎవరూ లేక - తనే దగ్గరుండి - తల దువ్వి - జడలేసారు నాన్న! అప్పుడు నాన్న కళ్ళల్లో కన్పించిన సన్నటి కన్నీటిపొర నాకింకా జ్ఞాపకం! ఆడపిల్లల పట్ల ఆయన కన్సర్న్ అలాంటిది !

ఒక రోజు - పెద్దక్కయ్య కూతురు సుకేశిని బారసాల కొరకు - ఇల్లంతా బూజు దులుపుతూంటే - దూలం మీద నుండి - నాముందు ఓ అగ్గిపెట్టె పడింది ! అగ్గిపెట్టె తెరిచిచూస్తే - అందులో చిటికెనవేలంత మూడు అల్యూమినియం గొట్టాలు కన్పించాయి ! అవి చూడగానే - వాటిని మూసలో పోసి కరుగబెట్టి - దానితో ఏదైనా ఆట వస్తువులు తయారు చేసుకుందామనిపించి - ఇంటి ఆవరణలో వున్న కంచరి కొలిమి దగ్గరకు వెళ్ళాను.

కంచరి గోపీనాథం దాదా ఏదో పనిలో వుండి నన్ను పట్టించుకోలేదు ! నాకు దొరికిన మూడు అల్యూమినియం గొట్టాల్లోంచి - ఒకటి - చేతిలోకి తీసుకున్నాను! దాన్ని మూసలో వేసి - కొలిమిలో పెట్టి - కుడిచేత్తో మంట ఎగదోస్తూ - ఆ అల్యూమినియం గొట్టం కరిగిందోలేదోనని ఎడం చేత్తో కలుపుతూ కూర్చున్నాను!

ఉన్నట్టుండి బ్రహ్మాండమైన పేలుడు ! మరుక్షణం.... చూద్దును కదా - నా ఎడం చేయి నుజ్జు నుజ్జయింది ! ధారాపాతంగా రక్తం కారుతోంది ! నేను చేష్టలుడిగి

నించుండి పోయాను ! నా వేళ్ళు నాకళ్ళముందే తెగి, కిందపడి గిలగిలా కొట్టుకుంటున్నాయి !

ఆ శబ్దానికి - గోపీనాథం దాదా పరిగెత్తుకొచ్చి - తన ధోతీ చింపి - నా చేతికి కట్టు కట్టాడు ! ఆగని రక్త స్రావం ! అప్పుడే అటు వైపు వచ్చిన చెల్లి నన్నాస్థితిలో చూసి బావురుమంది !

నా చెయ్యి మొద్దుబారిపోయిందేమో - నాకు ఏ నొప్పీ తెలీలేదు ! ఆ తర్వాత గంటకి మొదలైంది నొప్పి ! నేను ఒకటే ఏడుపూ - పెడబొబ్బలూ ! నాన్న ఇంట్లో లేరు ! పెద్దన్నయ్యకి కబురందింది. వెంటనే వచ్చి టాక్సీలో నిజామాబాదు గవర్నమెంట్ హాస్పిటల్‌కి తీసుకెళ్ళారు. మధ్యలో డిచ్‌పల్లిలో నాన్న కలిసారు !

'మోచేయి దాకా తీసేస్తాం ! లేకపోతే సెప్టిక్ అవుతుంది !' అన్నారు డాక్టర్లు.

నాన్న ఒప్పుకోలేదు ! నన్ను హుటాహుటిన హైదరాబాద్ షిఫ్ట్ చేసి - ఉస్మానియాలో అడ్మిట్ చేశారు.

చిన్నక్కయ్యా



శ్రీమతి పి. చిన్నమ్మ

అప్పటికీ పెద్దక్కయ్య డెలివరీ అయి కొన్ని రోజులే అయింది ! చిన్నక్కయ్యకి అప్పుడే పెళ్ళయింది ! అయినా నా ఆలనా పాలనా చూసుకోవడానికి మరెవరూ లేక - చిన్నక్కయ్యే హాస్పిటల్లో ఉండాల్సివచ్చింది! ఆ మూడు నెలలూ చిన్నక్కయ్యా - పెద్దత్తమ్మా చేసిన సేవల మూలంగా నా చేయి మోచేతిదాకా తొలగించాల్సిన అవసరం రాలేదు !

తర్వాత తెలిసింది - ఆ రోజు దొరికిన ఆ అల్యూమినియం గొట్టాలు... ఆ ఇంట్లో ఎప్పుడో పూర్వీకులు జంతువులని వేటాడడానికి ఉపయోగించిన తూటాలని... నాకావిషయం తెలీక - వాటికిందే నేను మంటపెట్టడంతో అవి పేలిపోయాయని!

పెద్దన్నయ్య



శ్రీ జి. భూమారెడ్డి

ఆ తర్వాత నన్ను నిజామాబాద్‌లో మోడరన్ పబ్లిక్ స్కూల్లో ఐదో తరగతిలో చేర్పించారు! సాయిల్ కన్జర్వేషన్ డిపార్ట్‌మెంట్‌లో జాబ్ అన్నయ్యకి ! తన వద్దే ఉండి చదువుకోవడం మొదలెట్టాను ! అప్పటికింకా పెద్దన్నయ్యకి పిల్లల్లేరు! పుస్తకాలూ - పెన్నులూ - షూ - నాకు ఏ అవసరమొచ్చినా పెద్దన్నయ్యే చూసుకునేవారు. ప్రజామత, కృష్ణాపత్రిక, జాగృతి, ఆంధ్రప్రభ, ఆంధ్రపత్రిక, ఆంధ్రభూమి - ఎన్నో - ఎన్నెన్నో పత్రికలు ఇంటికి తెచ్చేవారు. అలా ఎన్ని పుస్తకాలు చదివేదాన్నో లెక్కేలేదు.

అన్నయ్య ఇచ్చే పాకెట్ మనీతో - 'అరుణా బుక్ హౌజ్' కి వెళ్ళి - ప్రతినెలా చందమామ, బాలమిత్ర కొనుక్కునేదాన్ని ! ఎప్పుడూ ఏదో ఒకటి చదువుతూనే ఉండేదాన్ని ! నాకు కొంచెమో - గొప్పో సాహిత్యం మీద ఆసక్తి ఏర్పడింది అంటే- అది ఆనాడు నాలో పఠనాభిలాషని పెంచిన పెద్దన్నయ్య చలవే !

బహుశః 1960లో అనుకుంటా - నేను ఆరోతరగతి చదివే రోజుల్లో - ఏవో పుస్తకాలు తిరగేస్తోంటే - చిన్నన్నయ్య రాసిన 'అదిగో ఆంగ్లేయులు...' కవిత కన్పించింది.

చిన్నన్నయ్యలా నేను ఎందుకు కవిత రాయకూడదూ అన్పించింది ! ఎదురుగా గోడమీద లక్ష్మీదేవి అమ్మవారి ఫోటో కన్పించింది ! అమ్మవారు కూర్చున్న కమలం కన్పించింది ! లేడికి లేచిందే పరుగులా - కమలం మీద కవిత రాసేశాను !

చిన్నన్నయ్య



శ్రీ జి. రాజారెడ్డి

చిన్నన్నయ్య కవిత ఆ రోజు నా కంటబడకపోతే - బహుశః కవితలూ - కథలూ రాయాలన్న - స్ఫూర్తి నాకు కలిగేది కాదేమో !?

కథలంటే గుర్తొచ్చింది ! ఏడో తరగతిలో ఓ సారి మా మేనమామ వాళ్ళింట్లో 'చిరకాల నిద్రితుడు' కథ చదివాను! కథ చాలా నచ్చింది! అదెవరు చదివి ఉంటార్లే అనుకుని... అందులోని పేర్లూ - ఊర్లూ - డైలాగ్స్ అన్నీ మార్చేసి - అదే కథని ఇంకోలా రాసి - మామయ్యకి చూపించాను !

మామయ్య



శ్రీ కె. రాజారెడ్డి

మామయ్య ఆసాంతం చదివి - "భేష్ ! చదివిన కథని - పాత్రలు మార్చి కొత్తదానిలా రాశావ్ ! తలచుకుంటే - నువ్వే ఒక కొత్త కథ సృష్టించగలవు! ఇలా కాపీ కాకుండా - సొంతంగా రాయి!" సలహా ఇచ్చారు.

అలా బాల్యంలో - మామయ్య ఇచ్చిన సలహా, కుటుంబ సభ్యులతో పంచుకున్న మధురానుభూతులూ నా చుట్టూ వున్న సమాజాన్ని లోతుగా పరిశీలించి - విశ్లేషించుకోవడానికి దోహదపడి - మనసు స్పందించిన ప్రతిసారీ నేను కలం పట్టుకునేలా చేసి - నాలోని రచయిత్రికి ఊపిరి పోశాయి !

ఏ కోణంలోంచి చూసినా... తమ విశిష్ట వ్యక్తిత్వాలతో... 'మానవీయ విలువల'కు పట్టంగడ్తూ - ఈ రచనలకు స్ఫూర్తినిచ్చిన.... నా తోబుట్టువుల సహకారం నేను ఏ జన్మలోనూ తీర్చుకోలేనిది !

